క్లుప్తంగా

కృష్ణబాబు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటు



కృష్ణబాబు పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణ బాబు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో బుధవారం ఆయన కృష్ణబాబు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించిన సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు కృష్ణబాబు అన్నారు. 2012 నుంచి వైఎస్సార్ సీపీ అభివృద్ధిలో, పార్టీ విజయంలో కృష్ణబాబు కృషి ఎంతో ఉందన్నారు. కృష్ణబాబు మృతి తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడు ఎస్. రాజీవ్‌కృష్ణను ఆయన కుటుంబ సభ్యులను కలుసుకుని తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

రికార్డులు లేని 15 వాహనాల సీజ్



వాదాలకుంటలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట గ్రామంలో పోలీసులు బుధవారం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిపిన సోదాల్లో రికార్డులు లేని 15 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు దేవరపల్లి సీఐ కె. బాల సురేష్ చెప్పారు. కార్డన్ అండ్ సెర్చ్‌లో భాగంగా గ్రామంలో పోలీసులు జరిపిన తనిఖీల్లో ఒక ఇంటిలో ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ చెప్పారు. ఈ దాడుల్లో గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలుకు హిందూ ధర్మ పరిరక్షణ పాదయాత్ర



నిడదవోలులో శివకరణ్ సింగ్ పాదయాత్ర

నిడదవోలు: హిందూ ధర్మ పరిరక్షణకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పాదయాత్ర చేపట్టిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త శివ కరణ్ సింగ్ బుధవారం నిడదవోలు చేరుకున్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. నీలం రామారావు, వేదుల జనార్దనరావు, శ్రీకాకుళం పురుషోత్తం, గమిని వెంకటరత్నం, మెట్టుపల్లి సుబ్బారాయుడు, ఎస్. రామారావు, మల్లెల కృష్ణమూర్తి, వలివేటి వెంకట సుబ్బారావు, రాజోలు బాలసుబ్రహ్మణ్య శర్మ, నిడుమర్తి భాస్కరరావు, శాంతిలాల్ జైన్, జగదీష్ జైన్, ఆకుల సత్తిబాబు, భాస్కర్, వి.అనిల్, సిద్ధు, అనూష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులు అన్ని అంశాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని సీతంపేట ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయ నిర్వాహకుడు రాజు అన్నారు. గ్రంథాలయంలో బుధవారం ఏడవ రోజు సమ్మర్ క్యాంప్ ఉత్సాహంగా జరిగింది.



దొమ్మేరులో కృష్ణబాబు భౌతిక కాయానికి నివాళి అర్పిస్తున్న హోం మంత్రి వనిత, మాజీ ఎమ్మెల్యే బాబాజీరావు తదితరులు



కృష్ణబాబు మృతదేహానికి కుటుంబ సభ్యుల అంతిమ సంస్కారం



నివాళి అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వెంకట్రావు,శ్రీనివాస్ నాయుడు, సలహాదారు రాజీవ్‌కృష్ణ

దివికేగిన దిగ్గజం

- కృష్ణబాబుకు అంతిమ వీడ్కోలు
- శ్రద్ధాంజలి ఘటించిన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, పారిశ్రామికవేత్తలు, అభిమానులు
- నిష్కళంక నేతగా ఎదిగారు
- దొమ్మేరులో ముగిసిన అంత్యక్రియలు

కొవ్వూరు: మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) అంత్యక్రియలు బుధవారం మండలంలోని దొమ్మేరు గ్రామంలో అశ్రునయనాల మధ్య అభిమానులు, బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించారు. ఐదు సార్లు కొవ్వూరు ఎమ్మెల్యేగా పని చేసిన ఆయన ఈ ప్రాంత వాసుల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. నియోజకవర్గ ప్రజలతోనే గాకుండా, పరిసర ప్రాంత వాసుల హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచారు. నాలుగు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో అవినీతి మరక లేకుండా ప్రజలకు సేవలు అందించారు. మచ్చ లేని నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. తనను నమ్ముకున్న ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా కృష్ణబాబు పని చేశారు. ప్రాంతాలు వేరైనా, పార్టీలు వేరైనా ఎందరో నాయకులు ఆయనతో స్నేహభావంతో మెలిగే వారు. కృష్ణబాబు మరణ వార్త తెలియగానే రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ప్రముఖులు ఆయన అంతిమ సంస్కారానికి హాజరు కావడమే ఇందుకు నిదర్శనం. సౌమ్యుడు, మృదు స్వభావిగా పేరు తెచ్చుకున్న కృష్ణబాబు తన రాజకీయ జీవితంలో ఏనాడూ వెనుకడుగు వేయలేదు. ఎన్టీ రామారావుపై అభిమానంతో టీడీపీతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆయన 1983 నుంచి నాలుగు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచి, కొవ్వూరు నియోజకవర్గం ఏర్పడ్డాక అత్యధిక పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన రికార్డును సొంతం చేసుకున్నారు. పార్టీలకు అతీతంగా కృష్ణబాబుకు ఈ ప్రాంతంలో అభిమానులు ఉన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా నాయకులు దొమ్మేరు వచ్చి ఆయన భౌతిక కాయంపై పూలమాలలు వేసి అంతిమ వీడ్కోలు పలికారు. తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన చింతకాయల అయ్యన్నపాత్రుడు, నెల్లూరుకు చెందిన ఆనం రామనారాయణరెడ్డి, నన్నపనేని రాజకుమారి, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, వద్దే శోభనాద్రీశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్లు ముళ్లపూడి బాపిరాజు, ఇమ్మణ్ని రాజేశ్వరి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జి. శ్రీనివాస్ నాయుడు, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కృష్ణబాబు భౌతిక కాయానికి నివాళి అర్పించారు. అలాగే ఆరోగ్యం బాగా లేకపోయినప్పటికీ మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు వీల్ చైర్‌లో దొమ్మేరు వచ్చి కృష్ణబాబు మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యేగా రెండు సార్లు అవకాశం కల్పించిన కృష్ణబాబును జీవితంలో ఎప్పటికీ మరిచి పోలేనన్నారు.ఆయనను తన రాజకీయ గురువుగా భావించే వాడినన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, టీవీ రామారావు, ఆరిమిల్లి రాధాకృష్ణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, దేవి సీ ఫుడ్స్ జీఎండీ పోట్రు బ్రహ్మానందం, శ్రీ విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, నవ భారత్ ఇండస్ట్రీస్ ఎండీ బొల్ల రాజీవ్, ఆంధ్ర షుగర్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, జేఎండీలు పెండ్యాల అచ్చిబాబు, ముళ్లపూడి నరేంద్రనాథ్, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, నాయకులు గారపాటి శ్రీనివాసరావు, ఉప్పులూరి సూరిబాబు, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, ముదునూరి నాగరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వివిధ పార్టీల నాయకులు, పలువురు పారిశ్రామిక వేత్తలు, నాయకులు కృష్ణబాబుకు కన్నీటితో తుది వీడ్కోలు పలికారు.

మరిడి మహాలక్ష్మమ్మ ఉత్సవాలు ప్రారంభం



వేగేశ్వరపురం గ్రామ దేవత మరిడి మహాలక్ష్మమ్మవారు

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామ దేవత మరిడి మహాలక్ష్మమ్మ వారి ఉత్సవాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. ఏటా మే నెలలో వచ్చే పౌర్ణమి నాడు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి గరగ నృత్యాలతో చల్లఘటాన్ని గ్రామంలో ఊరేగించారు. గురువారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించనున్నారు. వేగేశ్వరపురం పంచాయతీ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, గ్రామ పెద్దలు, ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి విమ్స్‌లో ఉచితంగా ఆపరేషన్లు

నల్లజర్ల: పేదల అత్యవసర వైద్యానికి అంతరాయం కలగకుండా నల్లజర్లలోని విమ్స్ ఆసుపత్రిలో అన్ని రకాల ఆపరేషన్లు ఈనెల 23 నుంచి ఉచితంగా చేయనున్నట్టు ఆ ఆసుపత్రి ఎండీ డాక్టర్ పి.బాలకృష్ణ తెలిపారు. కేవలం మందులు, రక్త పరీక్షలకు మాత్రం బిల్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మెట్ట ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టరు బాలకృష్ణ తెలిపారు. దూర ప్రాంత ప్రజలు మరిన్ని వివరాల కోసం 80080 80229 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

లో-గ్రేడ్ పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోండి



లోగ్రేడ్ పొగాకు కొనుగోళ్లపై రైతు సంఘాల ప్రతినిధులతో చర్చిస్తున్న రీజనల్ మేనేజరు ఆదిశేషయ్య

- బోర్డు అధికారులకు రైతుల విజ్ఞప్తి
- ఆర్ఎం ఆదిశేషయ్యతో దేవరపల్లిలో భేటీ

దేవరపల్లి: లోగ్రేడ్ పొగాకు కొనుగోలుకు కంపెనీలు ముందుకు రావడం లేదని, దాదాపు 20 రోజులుగా ఐదు వేలం కేంద్రాల్లో లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లు నిలిచిపోయాయని ఐదు వేలం కేంద్రాల రైతు సంఘాల ప్రతినిధులు బోర్డు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లపై బుధవారం దేవరపల్లి వేలం కేంద్రంలో ఐదు వేలం కేంద్రాల రైతు సంఘాల ప్రతినిధులతో పొగాకు బోర్డు రీజినల్ మేనేజరు ఎం.ఆదిశేషయ్య సమావేశమై చర్చించారు. బ్రైట్ గ్రేడ్, మీడియం గ్రేడ్‌ల పొగాకు కొనుగోళ్లు బాగున్నప్పటికీ లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లు జరగడం లేదని రైతులు వివరించారు. ఈ ఏడాది 20 శాతం లో గ్రేడ్ పొగాకు పండినట్టు వారు తెలిపారు. మార్చి 6న పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కాగా నెల రోజులు లో గ్రేడ్ పొగాకు అమ్మకాలు జరిగాయన్నారు. అనంతరం బ్రైట్, మీడియం గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయడం వల్ల లోగ్రేడ్ పొగాకు నిల్వ ఉండిపోయిందని రైతు సంఘాల ప్రతినిధులు వివరించారు. బ్రైట్ గ్రేడ్ పొగాకుతో పాటు లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయాలని రైతులు ఆర్ఎం ఆదిశేషయ్యను కోరారు. పొగాకు మార్కెట్ పట్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు.

28న కొయ్యలగూడెంలో ఇరు వర్గాలతో భేటీ

పొగాకు రైతులు చెప్పింది సావధానంగా విన్న బోర్డు రీజినల్ మేనేజరు ఆదిశేషయ్య వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ నెల 28న కొయ్యలగూడెం వేలం కేంద్రం వద్ద రైతు సంఘాల ప్రతినిధులు, ట్రేడర్లతో సమావేశం ఏర్పాటు చేసి లోగ్రేడ్ పొగాకు కొనుగోళ్లపై చర్చలు జరుపుతామన్నారు. ఈ రకం పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పొగాకు మార్కెట్‌పై ఆయన చర్చించారు. మార్కెట్లో ధర బాగున్నందున రైతులు అమ్మకాలను వేగవంతం చేయాలని సూచించారు. ఎన్ఎల్ఎస్ మార్కెట్లో రైతులకు కిలో రూ.292 లభిస్తోందని, గరిష్ట ధర కిలో రూ.332 లభిస్తోందన్నారు. ఇప్పటి వరకూ ఐదు వేలం కేంద్రాల్లో 18.51 మిలియన్ల కిలోల పొగాకు కొనుగోలు చేసినట్టు ఆర్ఎం చెప్పారు. ఈ సమావేశంలో దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం-1, 2 వేలం కేంద్రాల రైతు సంఘాల అధ్యక్షులు కరుటూరి శ్రీనివాస్, విల్లూరి రాంబాబు, కాకర్ల నందియ్య, పరిమి రాంబాబు, సత్రం వెంకట్రావు, వేలం కేంద్రం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ



నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంలో విద్యార్థులు

నిడదవోలు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా బుధవారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ఇంగ్లిష్ సాహిత్యం, భారత స్వాతంత్ర్య సమయోధుల పుస్తకాలను, పాఠ్యా పుస్తకాలను చదివించారు. ఆరోగ్యం, అలవాట్లు, ప్రకృతి జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు యోగా తరగతులు కూడా నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి కుంచే చిన బాబు తెలిపారు. కార్యక్రమంలో వేదుల జనార్దన రావు తదితరులు పాల్గొన్నారు.

పెరవలి మండలంలో..

పెరవలి: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులలో భాగంగా మండలంలోని పెరవలి, ముక్కామల, తీపర్రు శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఆటలు, యోగా, ఇంగ్లిషు భాషలలో మెళకువలు నేర్పించారు. విద్యార్థులతో కథలు చదివించారు. ఇంగ్లిషు ఉపాధ్యాయుడు ఎ. పార్థసారథి వారికి ఆంగ్ల భాషలో పలు మెళకువలు నేర్పించారు. కరుటూరి విశ్వనాథం, సలాది సూర్యనారాయణ, పెరవలి, తీపర్రు, ముక్కామల గ్రంథాలయాధికారులు యు. వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, కె. వెంకటేశ్వర్లు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



పెరవలి గ్రంథాలయంలో విద్యార్థులకు ఇంగ్లిషులో శిక్షణ

చెస్, క్యారమ్స్‌లో శిక్షణ

నల్లజర్ల: వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు చెస్, క్యారమ్స్ వంటి ఆటలలో శిక్షణ ఇస్తున్నట్టు నల్లజర్ల శాఖా గ్రంథాలయ అధికారి ఏవీ రమణ తెలిపారు. రోజు ఉదయం 8 నుంచి 11.30 వరకూ ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. విద్యార్థులతో బుధవారం ఆయన పుస్తక పఠనం చేయించి, పుస్తక సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో కథలు చదివించారు. డిక్టేషన్ కాంపిటేషన్ నిర్వహించారు. చెస్, క్విజ్, జనరల్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లిషు వంటి అంశాలు నేర్పించారు.

కొనసాగుతున్న స్వామివారి కల్యాణోత్సవాలు



విశేష అలంకరణలో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు



ఆలయంలో తులసీ అర్చనలో పాల్గొన్న మహిళలు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు నాల్గో రోజైన బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. స్వామివారి దర్శనానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. దర్శనానికి గంట సమయం పట్టింది. దాతల సహకారంతో పిల్లలకు పాలు, పెద్దలకు చక్కెర పొంగలి, లడ్డూ ప్రసాదంగా పంపిణీ చేశారు. వందలాది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాలు భక్తులతో కళకళలాడాయి. భక్తులందరికీ ఉదయం, సాయంత్రం అన్నసమారాధన నిర్వహించారు. బుధవారం ఒక్కరోజే ఆరు వేల మంది స్వామివారి అన్న ప్రసాదాని స్వీకరించినట్టు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు మహిళలచే సామూహిక తులసీ అర్చన నిర్వహించారు. తులసి మొక్కలకు మహిళలు పూజలు చేశారు. అనంతరం తులసి మొక్కలను భక్తులకు సమర్పించారు.

ఆకట్టుకున్న కోలాటం

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం, సాయంత్రం వివిధ బృందాలు ప్రదర్శించిన కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.దేవాలయ ప్రాంగణంలో రోజూ ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. నిరాదరణకు గురైన జానపద, కూచిపూడి నృత్యాలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. బుధవారం ప్రదర్శించిన వేంకటేశ్వర కల్యాణం భక్తులను ఆకట్టుకుంది. అలివేలు మంగ, పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను గ్రామ వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని పురోహితుల వేద మంత్రాల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల నివారణ



పరిసరాల పరిశుభ్రతపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు

నల్లజర్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులకు నివారించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు సూచించారు. నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలోని గంటావారిగూడెంలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సర్వే, డ్రై డే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల నిల్వ ఆవాసాలను గుర్తించి నివారించాలన్నారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఖాళీ డబ్బాలు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు దోమలకు ఆవాసాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ దీపిక, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు లక్ష్మి, శాంతకుమారి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణతో రైతులకు పెట్టుబడి ఆదా

కొవ్వూరు: వ్యవసాయంలో యాంత్రీకరణ పాటిస్తే రైతులు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవచ్చని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.సాయి గంగాధరరావు పేర్కొన్నారు. ఆ విశ్వవిద్యాలయం విద్యార్థుల ఎన్ఎస్ఎస్ ప్రోగాంలో భాగంగా దొమ్మేరులో బుధవారం రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ, మూడు నుంచి నాలుగేళ్లకోసారి నేలను సబ్ సాయిలర్‌తో దున్నడం వలన నేలలో ఉండే పోషకాలు ఉపరితలంలోకి వచ్చి మొక్కలకు అందుతాయన్నారు. అంతేగాకుండా మొక్క వేరు వ్యవస్థ అభివృద్ధికి ఆస్కారం ఉంటుందన్నారు. వ్యవసాయ రంగంలో వినియోగించే వివిధ రకాల యంత్రాలను ప్రదర్శించి వాటి పనితీరు, కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఎలుకల నివారణకు విషపు ఎర తయారు చేసే విధానాన్ని డాక్టర్ అనూష రైతులకు వివరించారు. సాముహిక ఎలుకల నిర్మూలన విధానం గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కె.దక్షిణామూర్తి, డాక్టర్ సీహెచ్ సునీత, డాక్టర్ రవికుమార్, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

బౌద్ధ దమ్మపీఠంలో నేడు బుద్ధ పూర్ణిమ ఉత్సవం

ఉండ్రాజవరం: స్థానిక బౌద్ధ దమ్మ పీఠంలో గురువారం బుద్ధ పూర్ణిమ ఉత్సవం నిర్వహించనున్నట్టు బౌద్ధ పీఠాధిపతి బంతె అనాలియో బుధవారం తెలిపారు. ఈ దమ్మపీఠం ఆధ్వర్యంలో ఏపీ పాలిసెట్-2024కు ఉచితంగా కోచింగ్ ఇచ్చామని ఆయన తెలిపారు. ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులకు బుద్ధ పూర్ణిమ ఉత్సవంలో ప్రతిభా అవార్డులు ప్రదానం చేస్తామని చెప్పారు. అలాగే విద్యార్థులకు పాలిసెట్‌లో శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను సన్మానిస్తామని చెప్పారు. అలాగే ఎస్ఎస్‌సీ-2024లో మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులతో పాటు మండలంలోని 8 ఉన్నత పాఠశాలల నుంచి అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు యూటీఎఫ్ మండల శాఖ తరఫున ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని చెప్పారు. అలాగే ఆయా హెచ్ఎంలను సన్మానిస్తామని చెప్పారు.

భూముల సేద్యం కొరకు కౌలు హక్కునకు టెండరు-కం-బహిరంగ వేలం పాట ప్రకటన

ఈదిగువ స్టేట్‌మెంట్ నందు చూపిన దేవస్థానముల భూములు సేద్యము చేసుకొను కౌలుహక్కు 2024-2025 సం.రం. నుండి 2026-27 సం.రం. వరకు అనగా 3 సంవత్సరముల కాలపరిమితికి దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో భూముల సేద్యం కొరకు కౌలు హక్కునకు టెండరు-కం-బహిరంగ వేలం పాట పెట్టబడును. వేలం పాటలో పాల్గొనువారు ఈ క్రింది స్టేట్‌మెంట్ నందు చూపిన దరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

వ. నెం.	దేవస్థానం పేరు గ్రామం	ఆర్.యస్.నెం. గ్రామం	విస్తీర్ణం య.సెం.	పల్లం /మెరక	ధరావత్తు రూ.	కౌలుకాల పరిమితి	సీల్డు టెండరు స్వీకరించు, తేది, సమయం	వేలం పాట జరుగు ప్రదేశం, తేది, సమయం
1.	శ్రీవేణుగోపాలస్వామి వారి దేవస్థానం, గోపవరం	కాకరపర్రు RSNO.69/4	0.50	మెరక	2000/-	2024-25 నుండి 2026-27 వరకు 3సం.లు	ది.03.06.2024 ఉదయం గం.11.00 లకు	శ్రీరాజరాజనరేంద్రస్వామి వారి దేవస్థానం,(శివాలయం) కాకరపర్రు ది.03.06.2024 ఉదయం గం.11.00లు
2.	శ్రీరాజరాజ నరేంద్రస్వామి వారి దేవస్థానం, కాకరపర్రు	కాకరపర్రు RSNO.31	0.59	మెరక	2000/-	2024-25 నుండి 2026-27 వరకు 3సం.లు	ది.03.06.2024 ఉదయం గం.10.00 లకు	శ్రీరాజరాజనరేంద్రస్వామి వారి దేవస్థానం,(శివాలయం) కాకరపర్రు ది.03.06.2024 ఉదయం గం.10.00లు
3.	శ్రీరాజరాజనరేంద్ర స్వామి వారి దేవస్థానం, కాకరపర్రు	కాకరపర్రు RSNO.31	0.55	మెరక	2000/-	2024-25 నుండి 2026-27 వరకు 3సం.లు	ది.03.06.2024 ఉదయం గం.10.00 లకు	శ్రీరాజరాజనరేంద్రస్వామి వారి దేవస్థానం,(శివాలయం) కాకరపర్రు ది.03.06.2024 ఉదయం గం.10.00లు

షరతులు: వేలం పాట షరతులు, ఇతర వివరములకు దేవస్థానం కార్యాలయం పనిచేయు వేళలలో మేనేజరు వారిని అడిగి తెలుసుకొనవచ్చును.

గ్రామం : గోపవరం, కాకరపర్రు, తేది : 22.05.2024 ఇట్లు : మేనేజరు, 94412 65809